లక్ష్యాలను అధిగమించేనా..?

- మార్చి 31తో ముగియనున్న గడువు
- ఆస్తిపన్ను వసూళ్లకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు..
- కుత్బుల్లాపూర్ లక్ష్యం రూ.57.38 కోట్లు
- గాజులరామారం లక్ష్యం రూ.34.97 కోట్లు

కుత్బుల్లాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో నిర్దేశించిన ఆస్తిపన్ను లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కేవలం 3 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల అధికారులు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. సమయం దగ్గర పడుతుండడంతో రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని వసూళ్లు చేపడుతున్నారు. జంట సర్కిళ్ల పరిధిలోని పలు మొండి బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు డిమాండ్, రెడ్ నోటీసులను జారీ చేశారు. పలు ఆస్తులకు తాళాలు వేసి వాటిని జప్తు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లింపులో ప్రవేశపెట్టిన ఓటీఎస్ (వన్ టైమ్ స్కీమ్, వడ్డీలో 90 శాతం రాయితీ)తో మొండి బకాయిదారులకు, అటు అధికారులకు ఉపశమనం కలిగించింది.


షాపూర్‌నగర్‌లో దుకాణాలకు తాళాలు వేస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్ లక్ష్యం రూ.57.38 కోట్లు

కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను రూ.57.38 కోట్ల వసూలు చేయాలనే లక్ష్యంగా ఉన్నతాధికారులు నిర్ణయించారు. సర్కిల్ పరిధిలోని 9 డాకెట్లలో మొత్తం 63,276 ఆస్తులు ఉండగా వీటిలో నివాస ఆస్తులు, (రెసిడెన్షియల్) 54,954, వ్యాపార ఆస్తులు (నాన్ రెసిడెన్షియల్) 7,131, మిశ్రమ ఆస్తులు (మిక్స్‌డ్) 1,187 ఉన్నాయి. వీటిలో నివాస, వ్యాపార, మిశ్రమ ఆస్తుల నుంచి రూ.47 కోట్లు వసూలు చేశారు. దీని ప్రకారం ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ఇంకా రూ.10 కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉంది.

గాజులరామారం లక్ష్యం రూ.34.97 కోట్లు

గాజులరామారం సర్కిల్‌లో ఈ ఆర్థిక సంవత్సరానికి ఉన్నతాధికారులు రూ.34.97 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. సర్కిల్ పరిధిలోని 7 డాకెట్లలో మొత్తం 49,520 ఆస్తులు ఉండగా వీటిలో నివాస ఆస్తులు 43,558, వ్యాపార ఆస్తులు 4,370, మిక్స్‌డ్ ఆస్తులు 1,162 ఉన్నాయి. ఆస్తిపన్ను వసూల్లో భాగంగా గురువారం నాటికి నివాస, వ్యాపార, మిశ్రమ ఆస్తుల నుంచి రూ.30 కోట్లు వసూలు చేశారు. దీని ప్రకారం ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు రూ.4.97 కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను చెల్లింపునకు ఉన్న 3 రోజుల గడువులో కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో మిగిలిన పన్ను వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో వేచి చూడాల్సిందే..

లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నాం

ఆస్తిపన్ను వసూళ్లకు ప్రణాళికలు రూపొందించుకొని రోజువారీ లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాం. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు రెవెన్యూ అధికారులతో పాటు పలు విభాగాల సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. మిగిలిన మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో ఆస్తిపన్ను వసూలయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు ఆస్తిపన్ను చెల్లింపులో ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

- ఎల్‌వి.మల్లయ్య, ఉప కమిషనర్, గాజులరామారం


విద్యార్థులతో అతిథులు

సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌పై అవగాహన

దుండిగల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటాసైన్స్ విభాగాల్లో క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సాంకేతికత అభివృద్ధి, కెరీర్ అవకాశాలపై వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సీఎస్ఏ బెంగళూరు చాప్టర్ ఎస్‌సీ-2 చాప్టర్ హైదరాబాద్ వారు సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ.. డిజిటల్ సెక్యూరిటీ రంగాల్లో డేటా సైబర్ సెక్యూరిటీకి గురికాకుండా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగాల్లో పెను మార్పులు చోటు చేసుకున్నాయని, వాటిని గమనిస్తూ, సాంకేతికత అభివృద్ధికి అనుగుణంగా విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. సైబర్ భద్రత రంగాల్లో మార్పులు వేగంగా వస్తాయని, వీజే గరుడ పేరిట ఏర్పర్చిన విజిలెన్స్ క్లబ్ ద్వారా ఆ మార్పులను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా అధ్యాపకులు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఏ, చాప్టర్ అధ్యక్షురాలు సత్యవతి, డాక్టర్ ప్రశాంతి, జి.మౌనిక, డాక్టర్ చెన్నకేశవరావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం ఇస్తున్న బస్తీ, కాలనీ ప్రజలు

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసానికి నియోజకవర్గ పరిధిలోని బస్తీలు, కాలనీల ప్రజలు స్థానిక సమస్యలపై విన్నపాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.


ఎస్టీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఎస్టీపీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ రెయిన్‌బో విస్తా సమీపంలో నిర్మిస్తున్న ఎస్టీపీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే నాలాలు, చెరువుల్లోకి మురుగునీరు వెళ్లకుండా చూడడంతోపాటు మురుగునీటిని శుద్ధి చేయడం వల్ల పర్యావరణానికి పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. ఎస్టీపీల నిర్మాణ పనుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, నిధుల సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

డివిజన్‌ను అభివృద్ధి చేయడమే ధ్యేయం


రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శేషగిరి

గాజులరామారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. డివిజన్‌లోని మహాదేవపురం బ్లాక్- ఏ, డీలో జరుగుతున్న రోడ్డు పనులను స్థానికులతో కలిసి గురువారం పరిశీలించారు. కాంట్రాక్టర్ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పనులను నాణ్యతతో చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, చిన్నచౌదరి, వెంకటరెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.


భరత్‌సింహారెడ్డిని శాలువాతో సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

నేడు ఆలయంలో 108 కలశాలతో అభిషేకం

పేట్‌బషీరాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీకాలనీలోని రేణుకా ఎల్లమ్మతల్లి అష్టమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాశుపతనాథ యంత్ర విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా గోపూజ, యాగశాల అర్చన, గణారోహనం, గణప్రతిష్ఠ, హోమం, అన్నదాన నిర్వహించారు. సాయంత్రం శివ పార్వతులను ఊరేగించి, గ్రామ ఉత్సవాలు జరిగాయి. శుక్రవారం రేణుకా ఎల్లమ్మతల్లికి 108 కలశాలతో విశేష పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ, అమ్మవారి మూలమంత్ర హోమం, నిత్యపూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం పూజల్లో పాల్గొన్న మేడ్చల్ బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.


మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలను అందజేస్తున్న దాతలు

ప్రభుత్వ పాఠశాలకు కుర్చీల వితరణ

కూకట్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వైశ్య యువ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలకు 10 కుర్చీలను ఉచితంగా గురువారం అందజేశారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు కూర్చునేందుకు కుర్చీల కొరత ఉన్నట్లు అసోసియేషన్ దృష్టికి రావడంతో తమవంతు సహకారం అందించామని అసోసియేషన్ నిర్వాహకులు మేడిశెట్టి నరేష్‌గుప్తా తెలిపారు. వచ్చే ఏడాది విద్యార్థులకు బెంచీలు అందజేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్‌కుమార్, నాగార్జున, విజయ్‌కుమార్‌గుప్తా, హెచ్ఎం కృష్ణయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ ఉచిత వైద్య శిబిరం

వివేకానందనగర్ కాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని విజయ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీస్‌లో డా.ధనుంజయ సాగర్, డా.రామకృష్ణల ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్ ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కార్పొరేటర్ రోజాదేవి దంపతులు హాజరైన ఈ కార్యక్రమంలో పలువురు ఆక్యుపంక్చర్ సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మాట్లాడుతూ.. ఉచిత సేవలను అందిస్తూ సామాన్యులకు ఆక్యుపంక్చర్ పట్ల అవగాహన కల్పిస్తున్న విజయ సీనియర్ సిటిజన్స్ సభ్యులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ట్ అండ్ బార్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

బిజినెస్ కెరీర్‌కు 'ఇగ్నైట్' దోహదం

జేఎన్‌టీయూలో ముగిసిన రెండు రోజుల శిక్షణ


జె-హబ్‌లో ఇగ్నైట్ ప్రోగ్రాంకు హాజరైన వివిధ కళాశాలల అధ్యాపకులు

హైదరాబాద్ సిటీ, మార్చి28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించే నిమిత్తం వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులకు ఏర్పాటు చేసిన రెండ్రోజుల 'ఇగ్నైట్ సర్టిఫికెట్ ప్రోగ్రాం గురువారంతో ముగిసిందని జెహబ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనుబంధ, అఫిలియేటెడ్ కాలేజీలకు చెందిన సుమారు 75 మంది అధ్యాపకులు పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు. దేశంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను కెరీర్ ఆపర్చునిటీగా మార్చాలన్న ఉద్దేశంతో పని చేస్తున్న వాద్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇగ్నైట్ ప్రోగ్రాం విజయవంతంగా పూర్తయిందన్నారు. విద్యార్థుల వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఈ సర్టిఫికేట్ ప్రోగ్రామ్ ఎంతగానో దోహదపడుతుందని డైరెక్టర్ శ్రీదేవి ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యవస్థాగత నైపుణ్యాల అభివృద్ధికి ఒప్పందం

హైదరాబాద్ సిటీ, మార్చి28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో వ్యవస్థాగత నైపుణ్యాలను అభివృద్ధి పరచడమే లక్ష్యంగా బెంగళూరుకు చెందిన నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నెట్‌వర్క్ (ఎన్ఈఎన్) సంస్థ తో జేఎన్‌టీయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జేఎన్టీయూలో చదువుతున్న విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి వారు సొంతంగా స్టార్టప్‌లను ప్రారంభించేలా తగిన శిక్షణను ఎన్ఈఎన్ అందించనుందని జె-హబ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీదేవి తెలిపారు. స్టార్టప్ కంపెనీని మార్కెట్‌లోకి ప్రవేశపెట్టడం, మార్కెట్‌కు అనుకూలంగా వారికి శిక్షణ ఇవ్వడం, ఎగుమతుల విషయంలో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ నరసింహారెడ్డి, రెక్టార్ విజయ కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, మేనేజ్‌మెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ సింధు, అకడమిక్ అఫైర్స్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణ, ఆడిట్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్న, ఎన్ఈఎన్ రీజనల్ డైరెక్టర్ సోనాలి అగ్నిహోత్రి, సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ అమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణితో బీఆర్ఎస్ నేతల అక్రమాలు

- రెవెన్యూ అధికారుల సాయంతో నకిలీ వ్యక్తికి పట్టాదారుహక్కు
- నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు సతీష్


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

దుండిగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, రెవెన్యూ అధికారుల సాయంతో నకిలీ వ్యక్తికి పట్టాదారుహక్కు కల్పించారని నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు సతీష్ ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దుండిగల్ మండలంలోని సర్వే నంబర్ 614 (1.35 ఎకరాలు), సర్వే నంబర్ 641లో (6.29 ఎకరాలు) ఉందని, దీనిని మహ్మద్ జబ్బార్ అనే వ్యక్తికి ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్ (ఓఆర్‌సీ) ద్వారా రెవెన్యూ అధికారులు గతంలో హక్కు కల్పించారని చెప్పారు. తర్వాత కాలంలో జీపీఏ ద్వారా జబ్బార్.. పున్నారావుకి భూములను అమ్మాడన్నారు. అనంతరం పున్నారావు.. సుకుమార్‌రెడ్డికి విక్రయించినప్పటికీ.. ఆయన మ్యూటేషన్ చేసుకోలేదన్నారు. ఆ సమయంలో భూముల ధరలు తక్కువగా ఉండడంతో సుకుమార్‌రెడ్డి తన ఆధీనంలోకి భూములను తీసుకోలేదన్నారు. ఇక్కడి వరకు సజావుగా ఉన్నప్పటికీ.. ఆ తర్వాత అదే సర్వే నంబర్లలో మిగతా పట్టాదారులైన మాలోతు హరినాయక్, జగన్‌నాయక్, భీమ్‌సింగ్‌లు.. సుకుమార్‌రెడ్డి భూములను ఆక్రమించాలని ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మహమ్మద్ సలీం అనే వ్యక్తిని జబ్బార్ వారసుడిగా పేర్కొంటూ రెవెన్యూ రికార్డుల్లో చేర్చారని చెప్పారు. సలీం పేరిట తప్పుడు ఓటర్‌కార్డును సృష్టించి ఎంవై మహర్షి అనే వ్యక్తికి మరోసారి ఈ భూములను ఏజీపీఏ (డాక్యుమెంట్ నంబర్ 2825/2009) చేశారన్నారు. అయితే మహర్షికి అనుమానం రాకుండా అప్పటికే సుకుమార్‌రెడ్డికి అమ్మిన భూమితో పాటు హరినాయక్‌కు ఉన్న భూమిని కూడా ఏజీపీఏ ద్వారా అయనకు బదలాయించారన్నారు. విషయం తెలుసుకున్న సుకుమార్‌రెడ్డి.. సలీం, హరిసింగ్, పరమేశ్వర్‌లు కలిసి మహర్షికి అమ్మిన భూములపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ఉండగానే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లో ఈ సర్వే నంబర్లు అందులో నమోదు కాలేదన్నారు. దీంతో అప్పటికే ఆందోళనలో ఉన్న సుకుమార్‌రెడ్డిని ట్రాప్‌లో వేసేందుకు మరోసారి జగన్‌నాయక్, భీమ్‌సింగ్‌లు.. స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్‌తో కలిసి ధరణిలో రికార్డు ఆపివేసినట్టు తెలిపారు. ఈ భూ కబ్జాదారులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, సెక్రటరీ అరుణ్, సోషల్ మీడియా కోకన్వీనర్ సురేష్ ఉదయ్ విజయ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ ముకేష్, సీనియర్ నాయకులు ఎల్లస్వామి, దుండిగల్ ఉపాధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి


డీసీ వంశీకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న నవతారెడ్డి

చందానగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణకు గురువారం వినతి పత్రం అందజేశారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని హైలాన్‌నగర్‌లోని సర్వేనెంబర్ 210లోని 4 వేల గజాల పైచిలుకు ఉన్న జీహెచ్ఎంసీ స్థలానికి ఉన్న ప్రహరీని స్థానిక ప్రజాప్రతినిధులు తొలగించి ఆక్రమించారు. గతంలో ఈ భూమిని రెవెన్యూ పరిధిలో ఉండగా ప్రజాప్రయోజనాల కోసం జీహెచ్ఎంసీకి అప్పగించారు. ఈ స్థలంలో మినీస్టేడియం నిర్మించాలంటూ అప్పట్లో నిధుల ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. అయితే నిర్మాణం జరగకపోగా ఆ స్థలాన్ని కొందరు కబ్జాచేసేందుకు అనేకసార్లు యత్నించారు. స్థానికులు అడ్డుకున్న వినకుండా దొడ్డిదారిలో ఆ స్థలాన్ని ఆక్రమణలను కొంతస్థలాన్ని ఆక్రమించారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి పత్రంలో కోరినట్లు నవతారెడ్డి తెలిపారు.



- కాంగ్రెస్‌లో చేరికలు

బీఆర్ఎస్ నాయకులు, కుత్బుల్లాపూర్ మాజీ కౌన్సిలర్ వీవీ సాగర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం.

- పేట్‌బషీరాబాద్, ఆంధ్రజ్యోతి

అధ్వానంగా మియాపూర్ రోడ్లు

- డ్రైనేజీ, తాగునీటి లీకేజీలతో గుంతలమయం
- పట్టించుకోని అధికారులు


అధ్వానంగా మారిన దీప్తిశ్రీనగర్ రేగులకుంట రహదారి

మియాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ, మంజీర పైపులైన్ల లీకేజీలతో రోడ్లపై తాగునీరు వృథాగా పోవడంతో పాటు డ్రైనేజీ నీరు నిత్యం రోడ్లపై పారుతుండటంతో రోడ్లన్నీ ధ్వంసమై గుంతలమయంగా మారుతున్నాయి. ప్రధానంగా మంజీర పైపులైన్లు, డ్రైనేజీ లైన్లలీకేజీలు అరికట్టడంలో వివిధ శాఖల అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఈ కారణంగా మురుగునీరు, నిరంతరం రోడ్లపై పారుతుండడంతో ప్రధాన, అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. పలు ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా మారిన రోడ్ల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా దీప్తి శ్రీనగర్ నుంచి ధర్మపురి క్షేత్రానికి వెళ్లే దారిలోని రేగులకుంట వద్ద మురుగునీరు రోడ్లపై పారుతుంది. నీరంతా రోడ్లపై నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రహదారులపై వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా హఫీజ్‌పేటలోని పలు అంతర్గత రహదారులతో పాటు మైత్రికమాన్ నుంచి మంజీర పైపులైను రోడ్డు కలిసే చోట గుంతల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన, అంతర్గత రహదారుల్లో డ్రైనేజీ నీరు పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీనిపై స్థానికులు ఫిర్యాదులు చేసిన అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కూకట్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ మల్కాజ్‌గిరి అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహ్యాలపై అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని రమేష్ పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జీడిమెట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడు కిందపడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూలపల్లి రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. కొంపల్లి ప్రాంతంలోని అపర్ణ పామ్‌గ్రోవ్‌లో నివాసముంటున్న అక్కినపల్లి ఆనంద్‌రెడ్డి, సువర్ణల రెండో కుమారుడు వంశీధర్‌రెడ్డి(24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి రాత్రి 11గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. వెనుక నుంచి వాహనం ఢీకొట్టడంతో కిందపడడంతో తలకు గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

లింగంపల్లి ప్రభుత్వ స్కూల్‌కు క్రీడాసామగ్రి వితరణ


క్రీడాసామగ్రి అందజేస్తున్న హేవంత్‌ముదిరాజ్

గచ్చిబౌలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను చిన్నప్పటి నుంచే క్రీడల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రేవంత్‌ముదిరాజ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- జేఎన్‌టీయూ జేఏసీ డైరీ ఆవిష్కరణ



జేఎన్‌టీయూ-హెచ్ జేఏసీ 2024 డైరీని వర్సిటీ వీసీ కట్టా నరసింహారెడ్డి తన చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. డైరీలోని సమాచారం చూసి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రంజిత్‌కుమార్‌ను వీసీ అభినందించారు. అనంతరం డైరీలను రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు అందజేశారు.

- జేఎన్‌టీయూ, ఆంధ్రజ్యోతి

రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలి

గచ్చిబౌలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, వాటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని శేరిలింగంపల్లి ఉపకమిషనర్ రజనికాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలపై సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏ రాజకీయ పార్టీ సభలు, సమావేశాలు పెట్టాలనుకుంటే నోడల్ అధికారి మల్లికార్జున్ అనుమతి తీసుకోవాలని వివరించారు. ఆయా పార్టీలు ఇష్టానుసారం సారం పోస్టర్లు, కరపత్రాలు ప్రచురించుకుని ప్రజలకు పంపిణీ చేయడం చేస్తే చట్టరీత్య నేరం అవుతుందన్నారు. ఇలా చేయాలనుకునే వారు ముందుగా అనుమతులు తీసుకోవాలని, అనంతరం మాత్రమే వాటిని ముద్రించాలన్నారు. ఆయా పార్టీలు ఖర్చులను ఖచ్చితంగా నోడల్ అధికారికి ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో 85 ఏళ్లకు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే ఓటువేసే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, ఎన్‌సీపీఏ(యు) నాయకులు పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న డీసీ రజనికాంత్‌రెడ్డి

యువకుడి అదృశ్యం


సతీష్

హైదర్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'నా చావుకు ఎవరూ కారణం కాదు. నాకున్న ఇబ్బందులు వల్లే చనిపోతున్నా' అతని తాను ఉం టున్న హాస్టల్ గదిలో ఉత్తరం రాసిపెట్టి ఓ యువకుడు అదృశ్యమయ్యా డు. కేపీహెచ్‌బీ ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన వాంఛనాగిరి సతీష్(30) కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఓ మాల్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం షాప్‌కు వెళ్లి అక్కడి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. హాస్టల్ రూంలో లేఖను గుర్తించిన స్నేహితులు సతీష్ తండ్రికి సమాచారం అందించారు. సతీష్ తండ్రి హైదరాబాద్ చేరుకుని స్నేహితుల వద్ద విచారించి కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.